"సర్వ ప్రాప్తుల స్మృతిని ఇమర్జ్ చేసి అచల స్థితిని అనుభవము చెయ్యండి మరియు జీవన్ముక్తులుగా అవ్వండి"

ఈరోజు భాగ్యవిధాత బాబా విశ్వములోని తమ సర్వ శ్రేష్ఠ భాగ్యవంతులైన పిల్లలను చూస్తున్నారు. పిల్లలు ప్రతి ఒక్కరి భాగ్యము యొక్క మహిమను స్వయంగా భగవంతుడు గానం చేస్తున్నారు. బాబా మహిమనైతే ఆత్మలు గానం చేస్తారు కానీ పిల్లలైన మీ మహిమను స్వయంగా తండ్రి చేస్తారు. మాకు ఇంతటి శ్రేష్ఠ భాగ్యము తయారై ఉంది అని ఎప్పుడైనా స్వప్నములోనైనా ఆలోచించారా, కానీ అది తయారై ఉంది, తయారయ్యింది. ప్రపంచములోని వారు - మమ్మల్ని భగవంతుడు రచించారు అని అంటారు కానీ వారికి భగవంతుని గురించీ తెలియదు, రచనను గురించీ తెలియదు. భాగ్యవాన్ పిల్లలైన మీరు ప్రతి ఒక్కరూ అనుభవంతో మరియు నషాతో - మేము శివ వంశీ బ్రహ్మాకుమారులము, బ్రహ్మాకుమారీలము, మమ్మల్ని బాప్ దాదా ఎలా రచించారో మాకు తెలుసు అని అంటారు! చిన్న పిల్లవాడినైనా, వృద్ధ పాండవులనైనా, శక్తులనైనా, ఎవరినైనా సరే - మీ తండ్రి ఎవరు అని అడిగితే ఏం అంటారు? నషాతో అంటారు కదా - మమ్మల్ని శివబాబా బ్రహ్మాబాబా ద్వారా రచించారు, కనుక మేము భగవంతుని పిల్లలము, మేము భగవంతుడిని డైరెక్ట్ గా కలుసుకుంటాము, ఆ పరమాత్మ లేక భగవంతుడు కేవలం మాకు తండ్రి మాత్రమే కాదు, కానీ వారు తండ్రి కూడా, శిక్షకుడు కూడా మరియు సద్గురువు కూడా. అందరికీ ఈ నషా ఉందా? (చప్పట్లు కొట్టారు) ఒక చేతితో చప్పట్లు కొట్టాలి - ఇప్పుడు ఈ ఎక్సర్సైజ్ ను వృద్ధులకు నేర్పించాల్సి ఉంటుంది. పిల్లలు సంతోషంగా ఉండటాన్ని చూసి బాప్ దాదా కూడా సంతోషములో ఊగుతారు మరియు వాహ్, నా ప్రతి ఒక్క శ్రేష్ఠ భాగ్యవాన్ విశేష ఆత్మలూ... అని సదా అంటారు. తండ్రి రూపములో పరమాత్మ పాలనను అనుభవము చేస్తున్నారు. ఈ పరమాత్మ పాలన మొత్తం కల్పంలో కేవలం ఈ బ్రాహ్మణ జన్మలోనే పిల్లలైన మీకే ప్రాప్తిస్తుంది, ఈ పరమాత్మ పాలనలో ఆత్మకు సర్వ ప్రాప్తి స్వరూపము అనుభవమవుతుంది. పరమాత్మ ప్రేమ సర్వ సంబంధాలను అనుభవము చేయిస్తుంది. పరమాత్మ ప్రేమ తమ దేహ భానాన్ని కూడా మరపింపజేస్తుంది, దానితోపాటు అనేక స్వార్థంతో కూడిన ప్రేమలను కూడా మరపింపజేస్తుంది. ఇటువంటి పరమాత్మ ప్రేమ, పరమాత్మ పాలనలో పాలింపబడే భాగ్యవాన్ ఆత్మలు మీరు. ఆత్మలైన మీది ఎంతటి భాగ్యము, స్వయంగా బాబా తమ వతనాన్ని వదిలి ఈశ్వరీయ విద్యార్థులైన మిమ్మల్ని చదివించేందుకు వస్తారు. ప్రతిరోజూ ఉదయముదయమే దూరదేశం నుండి చదివించడానికి వచ్చేటువంటి టీచర్ ఎవరినైనా చూసారా? ఇటువంటి టీచర్ ను ఎప్పుడైనా చూసారా? కానీ పిల్లలైన మీ కోసం ప్రతి రోజు బాబా శిక్షకునిగా అయ్యి మీ వద్దకు చదివించడానికి వస్తారు మరియు అది కూడా ఎంత సహజంగా చదివిస్తారు. ఇది రెండు పదాల యొక్క చదువు - మీరు మరియు బాబా, ఈ రెండు పదాలలోనే చక్రము అనండి, డ్రామా అనండి, కల్పవృక్షము అనండి, మొత్తము జ్ఞానమంతా ఇమిడి ఉంది. ఇతర చదువులలోనైతే ఎంతగా మెదడుపై భారము పడుతుంది, కానీ బాబా చదివించే చదువుతో బుద్ధి తేలికైపోతుంది. తేలికదనానికి గుర్తు పైకి ఎగరటము. తేలికైన వస్తువు స్వతహాగనే పైన ఉంటుంది. ఈ చదువుతో మనసు-బుద్ధి ఎగిరే కళను అనుభవం చేస్తాయి. కనుక బుద్ధి తేలిక అయ్యింది కదా! మూడు లోకాల జ్ఞానం లభిస్తుంది. మరి ఇటువంటి చదువును మొత్తం కల్పంలో ఎవ్వరైనా చదివారా. ఈ విధంగా చదివించేవారు ఎవ్వరైనా లభించారా. కనుక ఇది భాగ్యము కదా! అలాగే సద్గురువు ద్వారా ఎటువంటి శ్రీమతము లభిస్తుందంటే, దాని ద్వారా సదాకాలం కొరకు - ఏం చేయను, ఎలా నడవను, ఇలా చెయ్యనా వద్దా, ఏమవుతుంది... ఈ ప్రశ్నలన్నీ సమాప్తమైపోతాయి. ఏం చెయ్యను, ఎలా చెయ్యను, ఇలా చెయ్యనా లేక అలా చెయ్యనా... ఈ ప్రశ్నలన్నింటికీ ఒక్క మాటలో సమాధానము ఏమిటంటే - ఫాలో ఫాదర్. సాకార కర్మలలో బ్రహ్మాబాబాను ఫాలో చెయ్యండి, నిరాకారీ స్థితిలో అశరీరులుగా అవ్వటంలో శివబాబాను ఫాలో చెయ్యండి. బాబా మరియు దాదా, ఇరువురినీ ఫాలో చెయ్యటము అనగా ప్రశ్నార్థకము సమాప్తమవ్వటము మరియు శ్రీమతముపై నడవటము. ఇది కష్టమా? అడగాల్సిన అవసరము ఉంటుందా? కాపీ చెయ్యాలి, మీ బుద్ధిని నడిపించకూడదు. బాబా సమానంగా అవ్వటము అనగా ఫాలో ఫాదర్ చెయ్యటము. కష్టమా లేక సహజమా? సహజమే కదా? 30 సంవత్సరాల వారు చేతులెత్తండి. అచ్ఛా, 30 సంవత్సరాలలో కష్టమనిపించిందా లేక సహజమనిపించిందా? ఇప్పుడు చూడండి, 30 సంవత్సరాల వారికి కూడా సహజమనిపించినప్పుడు, మీలో ఎవరైతే తర్వాత తర్వాత వచ్చారో, వారికి కష్టమవుతుందా లేక సహజమవుతుందా? సహజమే కదా? (వేడి కారణంగా అందరి చేతులలో రంగురంగుల విసనకర్రలు ఉన్నాయి, వాటిని ఊపుతున్నారు). బాగుంది, విసనకర్రల సందడి కూడా మంచిగా అనిపిస్తూ ఉంది. సీన్ బాగుంది. నవీనత ఉండాలి కదా. ఈ గ్రూపుకు ఇది కూడా నవీనత, ఇది కూడా టీ.వి.లో

వచ్చింది. మంచిది, అందరూ పరుగుపరుగున చేరుకున్నారు, బాప్ దాదా కూడా ఈ స్నేహానికి అభినందనలను తెలుపుతున్నారు. చూడండి, ఇతర హద్దులోని గురువులు ఎవరైతే ఉంటారో, వారు ఎన్ని వరదానాలను ఇస్తారు? ఒకటి లేదా పది, అంతకన్నా ఎక్కువ ఇవ్వరు. కానీ మీకు సద్గురువు ద్వారా ప్రతిరోజూ వరదానం లభిస్తుంది. ఇటువంటి గురువును ఎప్పుడైనా చూసారా? చూడలేదు కదా! మీరే చూసారు, కల్పకల్పమూ చూసారు. కనుక సదా మీ భాగ్యము యొక్క ప్రాప్తులను ఎదురుగా పెట్టుకోండి. కేవలం బుద్ధిలో మర్జ్ చేసి పెట్టుకోకండి, ఇమర్జ్ చేయండి. మర్జ్ చేసి పెట్టుకునే సంస్కారాన్ని మార్చుకుని ఇమర్జ్ చెయ్యండి. మీ ప్రాప్తుల లిస్టును సదా బుద్ధిలో ఇమర్జ్ చేసి పెట్టుకోండి. ఎప్పుడైతే ప్రాప్తుల లిస్టు ఇమర్జ్ అవుతుందో, అప్పుడు ఏ రకమైన విఘ్నమూ దాడి చెయ్యదు. అది మర్జ్ అయిపోతుంది మరియు ప్రాప్తులు ఇమర్జ్ రూపములో ఉంటాయి.

ఈ రోజు ఏదో ఒక కారణం చేత కొంతమంది పిల్లలు శ్రమ పడుతున్నారు, యుద్ధము చేస్తున్నారు, యోగం చెయ్యాలనుకుంటున్నారు కానీ కుదరటం లేదు, ఆత్మాభిమానానికి బదులుగా దేహాభిమానంలోకి వచ్చేస్తున్నారు అని బాప్ దాదా విన్నప్పుడు, అది బాప్ దాదాకు మంచిగా అనిపించదు. ఇక్కడ కారణము ఏమిటి? తమ భాగ్యము యొక్క ప్రాప్తులు ఇమర్జ్ అయి ఉండవు, మర్జ్ అయి ఉంటాయి. మళ్ళీ ఎవరైనా గుర్తు చేసినప్పుడు - అవును, ఇలా జరగాలి కదా... అని ఆలోచించడం మొదలుపెడతారు. అందుకే చాలా సహజమైన పురుషార్థం ఏమిటంటే - ప్రాప్తులను ఇమర్జ్ చేసి పెట్టుకోండి. ఎప్పటి నుండైతే బ్రాహ్మణులుగా అయ్యారో, అప్పటి నుండి మీ భాగ్యాన్ని స్మృతిలో ఉంచుకోండి. అలజడిలోకి రాకండి, అచలముగా కండి ఎందుకంటే ఇక్కడ ఆబూలో ఏం స్మృతిచిహ్నము ఉంది? అచల్ ఘర్ ఉందా లేక అలజడి ఘర్ ఉందా? అచల్ ఘర్ కదా? ఇది ఎవరి స్మృతిచిహ్నము? మీ స్మృతిచిహ్నమే కదా? కనుక ఎప్పుడైనా ఏదైనా సూక్ష్మ పురుషార్థం యొక్క మార్గము కష్టమనిపిస్తే, బుద్ధి ఎక్కువ అలజడిగా ఉంటే, మీ స్మృతిచిహ్నాన్ని స్మృతిలోకి తెచ్చుకోండి. చాలాసార్లు పిల్లలు జ్ఞానం యొక్క పాయింట్లు చెప్తూ ఉంటారు కూడా - నేను ఆత్మను, ఇది డ్రామా, ఇది విఘ్నము కదా, ఇది సైడ్ సీన్ కదా, ఇలా మాట్లాడుతూ కూడా ఉంటారు కానీ కదులుతూ కూడా ఉంటారు. కదులుతూ, కదులుతూ మాట్లాడుతూ ఉంటారు. ఎప్పుడైతే బుద్ధి ఈ విధంగా తయారవుతుందో, అప్పుడు అచలంగా అవ్వలేరు, అప్పుడు మధుబన్ యొక్క అచల్ ఘర్ ను గుర్తు చేసుకోండి. ఇదైతే స్థూలమైనదే కదా, సూక్ష్మమైనదైతే కాదు. ఇది కనుల ద్వారా చూడగలిగేది. నా స్మృతిచిహ్నము అచల ఘర్, అలజడి ఘర్ కాదు. ఎందుకంటే బాప్ దాదా ఈ సంవత్సరాన్ని పిల్లలందరి కొరకు ముక్తి సంవత్సరంగా జరపాలని కోరుకుంటున్నారు. చేతులు ఎత్తిస్తే కొందరు ఎత్తి, కొందరు ఎత్తకుండా అన్నట్లు జరగకూడదు. అందరూ సంతోషంగా చేతులతో చప్పట్లు కొట్టాలి (అందరూ చప్పట్లు కొట్టడం మొదలుపెట్టారు) సరే, ఇప్పుడే కొట్టేసారు సరే, కానీ ఇలాగే బాప్ దాదా ఈ సంవత్సరం యొక్క సమాప్తిలో ఇంతే జోరుగా చప్పట్లు కొట్టడం చూడాలి. ఇప్పుడైతే చప్పట్లు కొట్టారు, మంచిది కానీ అప్పుడు కూడా కొట్టాలి. కొడతారా? చూడండి, చేతులతో చప్పట్లు కొట్టి అయితే సంతోషపరిచారు కానీ బాప్ దాదా కొత్త సంవత్సరములో, జనవరి 18న, విశేషంగా మన బ్రహ్మ బాబా శరీరం నుండి ముక్తి అయిన రోజు ఉంది కదా, ఆ జనవరి 18న బాప్ దాదా - ముక్తి సంవత్సరాన్ని జరుపుకున్నారా లేక కేవలం ఆలోచించారా అని మళ్ళీ చేతులు ఎత్తిస్తారు. జరుపుకోవాలి, జరుపుకోవాలి అని కేవలం ఆలోచిస్తూనే ఉండిపోలేదు కదా. స్వరూపంలోకి తీసుకొచ్చారా లేక ఆలోచిస్తూ-ఆలోచిస్తూ అంతిమంలో కూడా ఆలోచిస్తూనే ఉండిపోతారా! ఈ రిజల్టును బాప్ దాదా చూడాలనుకుంటున్నారు. చూపిస్తారా? అచ్ఛా. గుర్తుంటుంది కదా! ప్రాప్తులను ఎదురుగా పెట్టుకోండి. బాబా స్మృతితోపాటు, బాబా ఏదైతే ఇచ్చారో, అది కూడా ఇమర్జ్ చేయండి - ఎలా తయారుచేసారు మరియు ఏం లభించింది.

బాప్ దాదా ఈ సంవత్సరము తర్వాత పిల్లలు ప్రతి ఒక్కరినీ జీవన్ముక్తి స్థితిలో చూస్తారు. భవిష్యత్తులో జీవన్ముక్తులుగా ఉంటారు కానీ జీవన్ముక్తులుగా అయ్యే సంస్కారాన్ని ఇప్పటి నుండే ఇమర్జ్ చేసుకోవాలి. నిరంతర కర్మయోగి, నిరంతర సహజ యోగి, నిరంతర ముక్త ఆత్మ యొక్క సంస్కారాలను ఇప్పటి నుండి అనుభవంలోకి తీసుకురండి. ఎందుకు? బాప్ దాదా ఇంతకుముందు కూడా సూచనను ఇచ్చారు - సమయ పరివర్తన విశ్వ పరివర్తక ఆత్మలైన మీ కొరకు ఎదురుచూస్తూ ఉంది. ప్రకృతి, ప్రకృతిపతి ఆత్మలైన మిమ్మల్ని విజయమాలతో ఆహ్వానిస్తూ ఉంది. సమయము విజయ గంట మ్రోగించేందుకు భవిష్య రాజ్యాధికారి ఆత్మలైన మిమ్మల్ని చూస్తుంది, ఎప్పుడు గంటను మ్రోగించాలి అని చూస్తుంది. భక్త ఆత్మలు, ఎప్పుడు మా పూజ్య దేవాత్మలు మాపై ప్రసన్నులై మాకు ముక్తి యొక్క వరదానాన్ని ఇస్తారు అని ఆ రోజు కోసం ఎదురుచూస్తున్నారు! దుఃఖహర్త-సుఖకర్త ఆత్మలు ఎప్పుడు ప్రత్యక్షం అవుతారు అని దుఃఖిత ఆత్మలు పిలుస్తున్నారు! వీరందరూ మీ కొరకు ఎదురుచూస్తున్నారు మరియు ఆహ్వానిస్తున్నారు, అందుకే - ఓ దయార్ద్ర హృదయులైన విశ్వ కళ్యాణకారీ ఆత్మల్లారా, ఇప్పుడు వీరి ఎదురుచూపులను సమాప్తం చెయ్యండి.

అందరూ మీ కొరకు ఆగి ఉన్నారు. మీరందరూ ముక్తులైపోతే సర్వ ఆత్మలు, ప్రకృతి, భక్తులు ముక్తులైపోతారు. కనుక ముక్తులుగా అవ్వండి, ముక్తి దానాన్ని ఇచ్చే మాస్టర్ దాతలుగా అవ్వండి. ఇప్పుడు విశ్వ పరివర్తనా బాధ్యత యొక్క కిరీటధారీ ఆత్మలుగా అవ్వండి. బాధ్యత కలవారు కదా! బాబాతోపాటు సహాయకారులు. మీకు దయ కలగటం లేదా, మనసులో దుఃఖపు విలాపము అనుభవం అవ్వటం లేదా. ఓ విశ్వ పరివర్తక ఆత్మల్లారా, ఇప్పుడు మీ బాధ్యత యొక్క పట్టాభిషేకాన్ని జరపండి.

బాప్ దాదా ఇంతకుముందు కూడా చెప్పారు - 100 హిమాలయ పర్వతాల అంతటి అత్యంత పెద్ద విఘ్నము వచ్చినా కానీ పక్కకు జరగరు, ఓడిపోరు, పట్టాభిషేకాన్ని, ముక్తి సంవత్సరాన్ని తప్పకుండా జరుపుకుంటారు. బాప్ దాదా ప్రతిరోజు చార్ట్ చూస్తారు. ఇక్కడి నుండి వెళ్ళి, ట్రైన్ లోనే ఏమైందో తెలియదు అని అనటం కాదు, మళ్ళీ ఇంటికి వెళ్ళగానే కొంగలు మరియు హంసకు మధ్యన యుద్ధం జరగడం కాదు. ఇది జరిగింది, అది జరిగింది... అని చెప్పకండి. ఇది వినను. మీ ఉత్తరాలను చెత్తబుట్టలో వేస్తాను, వినను. దృఢ సంకల్పము చెయ్యండి - అవ్వాల్సిందే. ఎక్కడైతే దృఢత ఉంటుందో, అక్కడ సఫలత లభించకపోవటం అనేది అసంభవము. మరి అందరూ దృఢ సంకల్పం కలవారే కదా. టీచర్స్ చేతులెత్తండి. టీచర్స్ చాలామంది ఉన్నారు. మొత్తం సెంటర్లన్నీ ఖాళీ చేసి వచ్చారా ఏమిటి?

చూడండి, ఒక సంతోషకరమైన వార్తను వినిపిస్తాము - బాప్ దాదా చూసారు, ఇప్పుడే చూసారు, విన్నారు - మధుబన్ వారందరూ తమ పరివర్తనా లక్ష్యాన్ని చాలా బాగా పెట్టుకున్నారు. లక్షణాలను చూద్దాము కానీ లక్ష్యమైతే చాలా బాగా పెట్టుకున్నారు, తమలో ఏ మార్పు అయితే వచ్చిందో, దానిని కూడా వ్రాసారు. బాప్ దాదాకు ఏమి సంతోషం ఉందంటే - మార్పు రావటం ప్రారంభమైంది, మున్ముందు ఇంకా వస్తూ ఉంటుంది. అందరూ తమ దృఢ సంకల్పము యొక్క ఉల్లాస-ఉత్సాహాలను మంచిగా చూపించారు. ఇప్పుడింకా కాగితంపై ఉంది కానీ కాగితంపై వ్రాయడానికి ముందు మొదటి అడుగు వేసారు. బాప్ దాదాకు సంతోషంగా అనిపించింది, ఎందుకు? మొత్తం ప్రపంచానికి మధుబన్ నివాసులు - హే అర్జున్ వంటివారు. నిమిత్తులు మధుబన్ నివాసులు, రెండవ నంబరువారు దేశ-విదేశాలలోని నిమిత్త సేవాధారీ టీచర్లు. మరియు మొత్తం పరివారంలోని బ్రాహ్మణ ఆత్మలు సర్వ సహయోగీ సహచరులు. మధుబన్ పటాన్ని బాప్ దాదా చూస్తారు, అది పూర్తిగా మారినట్లుగా కనిపించాలి. మధుబన్ వారు తక్కువ వచ్చి ఉంటారు. చాలామంది అయితే వ్రాయనే వ్రాయలేదు. ముందు కూర్చున్నవారిలో తక్కువమంది వ్రాసారు, చాలా బిజీగా ఉన్నారు. కానీ ఎప్పుడైతే పని ఇవ్వడం జరుగుతుందో, అప్పుడు వ్రాసినందుకు కూడా మార్కులు జమ అవుతాయి. ఒకవేళ వ్రాయకపోతే అదనంగా వచ్చే మార్కులు తక్కువైపోయాయి, నష్టపర్చుకున్నారు. ఏయే డైరెక్షన్లు అయితే లభిస్తాయో, అవి డైరెక్ట్ గా బాబా ద్వారా లభించినా, నిమిత్త ఆత్మలైన దాదీల ద్వారా లభించినా, వాటికి గౌరవాన్ని ఇవ్వటము చాలా అవసరము. ఇందులో సాకులు చెప్పకండి, నిర్లక్ష్యము చెయ్యకండి. మార్కులు జమ అవ్వలేదు అని ఇకముందు కోసం బాప్ దాదా చెప్తున్నారు, అందుకే దీనికి మహత్వాన్ని ఇవ్వటము అనగా మహాన్ గా అవ్వటము. విషయాన్ని తేలికగా తీసుకోకండి. పిల్లలు చాలా తెలివైనవారు, బాప్ దాదాకైతే తెలుసు కదా అని అంటారు. బాప్ దాదాకు తెలుసు, కానీ ఎందుకు చెప్పారు? తెలిసే చెప్పారు కదా! అందుకే ఇలా చెప్పి తప్పించుకోకూడదు. చాలా పనులు ఎలా ఉంటాయంటే, అవి చిన్నచిన్నవే కానీ వాటికి 'హాజీ' చెయ్యటంలో ఎక్స్ ట్రా మార్కులు జమ అవుతాయి. చాలామంది విద్యార్థులు ఎలా ఉన్నారంటే, వారు ఏదో ఒక గత సంస్కారానికి వశమై ఉన్నారు, చాలా మంచి ఉల్లాస-ఉత్సాహాలతో ముందుకు వెళ్తారు కానీ ఏదో ఒక బంగారు దారము, చాలా సూక్ష్మమైన దారము వారిని ముందుకు వెళ్ళనివ్వదు. ఈ సూక్ష్మమైన దారం ఉండిపోయింది అని వారికి అర్థమవుతుంది కూడా కానీ... కానీ అనే అంటారు. కానీ కొందరు ఎలాంటి పురుషార్థులు ఉన్నారంటే, వారు చిన్న-చిన్న సాధారణ విషయాలలో 'హాజీ' చెప్పి మార్కులు తీసేసుకుంటారు. ఇలా కొన్ని-కొన్ని చొప్పున మార్కులు జమ అవుతూ-అవుతూ వారు ముందుకు వెళ్ళిపోవడము అనేది కూడా జరగవచ్చు, ఇటువంటివారు కూడా బాప్ దాదా వద్ద ఉదాహరణ రూపంలో ఉన్నారు. కనుక సహజమైన పద్ధతి ఏమిటంటే - చిన్నచిన్న విషయాలలో 'హాజీ' అంటూ మార్కులను జమ చేసుకుంటూ వెళ్ళండి. కట్ చేసుకోకండి, జమ చేసుకోండి. ఇకపోతే బాప్ దాదా చూసారు, మెజారిటీ తమ ఉల్లాస-ఉత్సాహాలను మంచిగా చూపించారు. అందుకే దృఢ సంకల్పం చేసినందుకు, విశేషంగా ఆ మధుబన్ నివాసి పిల్లలకు బాప్ దాదా - 'హాజీ' అన్నందుకు అభినందనలను తెలుపుతున్నారు, ప్రియస్మృతులను కూడా ఇస్తున్నారు. లక్షలాది రెట్ల ప్రియస్మృతులను ఇస్తున్నారు. ఎందుకు? మధుబన్ అనేది బాప్ దాదా స్వరూపాన్ని ప్రత్యక్షం చేసే అద్దాల మహల్. కావున ఒక విషయానికైతే సంతోషంగా ఉంది. ఇప్పుడు కాగితంపైకి వచ్చినదానిని కర్మలలోకి తీసుకురావాల్సిందే. సరేనా! అచ్ఛా! అభినందనలు.

ఒకవేళ ఇప్పుడు మీ అందరికీ - ఇప్పుడిప్పుడే అశరీరులుగా అవ్వండి అని అకస్మాత్తుగా డైరెక్షన్ లభిస్తే, అలా అవ్వగలరా లేక అలజడి కలుగుతుందా? ఎందుకు? చివరి సమయంలోని ఈ అభ్యాసమే పాస్ విత్ ఆనర్ గా చేస్తుంది. కనుక ఇప్పుడు బాప్ దాదా కూడా చెప్తున్నారు - ఒక్క క్షణంలో అన్ని విషయాలను పక్కన పెట్టి అశరీరీ భవ (డ్రిల్) అచ్ఛా.

నలువైపులా ఉన్న అతి శ్రేష్ఠ భాగ్యవంతులు, పరమాత్మ పాలనకు అధికారి ఆత్మలు, పరమాత్మ చదువుకు అధికారులు, సద్గురువైన పరమాత్మ వరదానాలకు అధికారులు, సదా దృఢత ద్వారా సఫలతకు అధికారులు, సదా అఖండ యోగులు, అచల యోగులు, సదా విశ్వ పరివర్తన యొక్క బాధ్యతా కిరీటధారులు, సదా సర్వ ప్రాప్తులను ఇమర్జ్ రూపంలో అనుభవము చేసే అటువంటి విశేష ఆత్మలకు బాప్ దాదా యొక్క ప్రియస్మృతులు మరియు నమస్తే.

ఇప్పుడు ముక్తి సంవత్సరములో నంబర్ వన్ మధుబన్ నివాసులు, సరేనా? అవుతుందా లేక కష్టమా? (హాజీ) అలాగైతే బాప్ దాదా మధుబన్ వారికి కూడా బంగారు బ్యాడ్జ్ ను ఇస్తారు. మధుబన్ వారికి బ్యాడ్జ్ ఇవ్వాలి, ఇతరులు అందరికీ ఇచ్చారు, మధుబన్ వారికి ముక్తి సంవత్సరము యొక్క ప్రైజ్ ను ఇస్తాము. మీకు మంచి బ్యాడ్జ్ ఇస్తాము. అచ్ఛా!

వరదానము:- బ్రాహ్మణ జీవితములో ఒక్క బాబాను తమ ప్రపంచముగా చేసుకునే స్వతహా మరియు సహజయోగీ భవ

బ్రాహ్మణ జీవితములో పిల్లలందరి ప్రతిజ్ఞ ఏమిటంటే - ''ఒక్క బాబా తప్ప మరెవ్వరూ లేరు''. బాబాయే ప్రపంచము, ఇతరులెవ్వరూ లేనే లేరు అన్నప్పుడు స్వతహా మరియు సహజయోగీ స్థితి సదా ఉంటుంది. ఒకవేళ ఇతరులెవరైనా ఉన్నట్లయితే - బుద్ధి ఇక్కడికి వెళ్ళకూడదు, అక్కడికి వెళ్ళాలి అని కష్టపడాల్సి ఉంటుంది. కానీ ఒక్క బాబాయే సర్వస్వం అయినట్లయితే బుద్ధి ఎక్కడికీ వెళ్ళలేదు. ఈ విధంగా సహజయోగులుగా, సహజ స్వరాజ్య అధికారులుగా అవుతారు. వారి ముఖముపై ఆత్మికత యొక్క మెరుపు ఏకరసంగా ఒకేలా ఉంటుంది.

స్లోగన్:- తండ్రి సమానంగా అవ్యక్తంగా మరియు విదేహీగా అవ్వటము - ఇదే అవ్యక్త పాలనకు ప్రత్యక్ష ఋజువు.